క్లుప్తంగా

సృజనాత్మకత పెంపునకే సమ్మర్ క్యాంపులు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వలక్షణాలను పెంపొందించేందుకే యంగ్ ఇండియా సమ్మర్‌క్యాంపులు నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య అన్నారు. శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపును ఎంఈఓ శుక్రవారం సందర్శించి మాట్లాడారు. యంగ్ ఇండియా సమ్మర్‌క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. హెచ్‌ఎం కె.రమేష్, పీడీ రవి, శ్రావణ్‌కుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

పాలకుర్తి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వెంటనే పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని అన్నారు. శుక్రవారం పాలకుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై హౌసింగ్ కార్పొరేషన్ పీడీ మత్రు నాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు త్వరగా సమర్పించాలని అన్నారు. హౌజింగ్ డీఈ బజరంగ్‌లాల్, ఏడీ ఆజ్మీరా పరశురాంనాయక్, ఎంపీడీఓలు రాములు, నాగ శేషాద్రి, ఏఓ శరత్ చంద్ర, ఏఈలు రోహిత్, ఎంపీఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి మహంకాళి దేవాలయ ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన మహంకాళి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కుందూరు నాగమణి, సోమిరెడ్డి తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి ఉత్సవాలను రావాల్సిందిగా ఆహ్వానించారు.

కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ ఆదేశాను సారం శుక్రవారం పార్టీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా పుప్పాల వేణుకుమార్, ఉపాధ్యక్షులుగా సల్ల వాసుదేవరెడ్డి, దైతల రంజిత్‌కుమార్, గాదె ఉపేందర్, నీలారపు వనేష్, ప్రధాన కార్యదర్శులుగా ఉడుత రంజిత్, తుమ్మలపల్లి సోమేశ్వర్, కార్యదర్శులుగా చందర్నాయక్, వసంత్, సరిత, స్వరూప, కోశాధికారిగా చిలూపూరి వాణితో పాటు 24 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండల కేంద్రంలో జోగు నర్సింహ కూతురు వైష్ణవి వివాహం కోసం చిన్ననాటి సహచర మిత్రులు (1994–95 బ్యాచ్) రూ.30 వేల సాయం అందించారు. బాల్యమిత్రులకు ఎలాంటి విషయంలోనూ తోడ్పాటు అందించేందుకు కృతనిశ్చయంతో ఉంటామన్నారు. మాజీ ఎంపీటీసీ జాకీర్, గొడిశాల మల్లేష్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, వేణు, కొండయ్య, తిరుపతిరెడ్డి, రవి పాల్గొన్నారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన పట్నంశెట్టి రేణుక–కుమారస్వామి దంపతుల కూతురు భార్గవి వివాహానికి సామాజిక సేవా కర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల సాయం అందజేశారు. సిద్దారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, దశరథ, భద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్ జేసీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టులకు అతిథి(టెస్ట్) పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ కోరారు. కళాశాల స్థాయిలో గణిత, భౌతిక, రసాయన, జంతు, వృక్ష శాస్త్రాలు, పాఠశాల స్థాయిలో పదో తరగతి వరకు తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, గణిత, జీవశాస్త్రం పోస్టుల కోసం ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌ల ఎక్స్‌పర్ట్స్ ఆధ్వర్యంలో డెమో తరగతులు నిర్వహించి నియామకాలు చేపట్టడం జరుగుతుందని, డెమో క్లాసుల తేదీలను దరఖాస్తు గడువు ముగిశాక తెలియజేస్తామని ఆయన తెలిపారు.

పిడుగుపాటుకు ఎడ్లు మృతి

పాలకుర్తి: పిడుగుపాటుకు రెండు ఎడ్లు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని దర్దేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. రూ.2లక్షల విలువ చేసే రెండు ఎడ్లు పిడుగుపడటంతో మృతి చెందాయని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు చిలువేరు శ్రీను కోరారు.

విద్యుదాఘాతంతో దూడ..

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామంలో దూడ విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందింది. బాధిత రైతు రైతు నక్క సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్యకు చెందిన దుద్దె పొలం వద్ద మేతమేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 35 వేల విలువ చేసే దూడ మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- నాలుగేళ్లుగా కంకరరోడ్డుపై ప్రజల పాట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు




కంకరపోసి వదిలేసిన పాంనూర్-నమిలిగొండ రోడ్డు, (ఇన్‌సెట్‌లో) శిలాఫలకం

స్టేషన్‌ఘన్‌పూర్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధులు పట్టింపులేనితనం ప్రజల పాలిట శాపంగా మారుతుంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన పనులు ఇప్పటివరకు పూర్తి కాకపోవడంతో కంకరరోడ్డుపై ప్రయాణంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాంనూర్ గ్రామం నుంచి నమిలిగొండ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు నాలుగేళ్ల క్రితం చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. నమిలిగొండ గ్రామం నుంచి పాంనూర్‌కు బీటీ రోడ్డుపై నుంచి వెళ్లాలంటే వాస్తవానికి శివునిపల్లి గ్రామం మీదుగా రావాల్సి ఉంటుంది. అయితే మొత్తం ఆరు కిలోమీటర్ల దూరం ఉంటుంది. స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల ప్రజలకు అనువుగా ఉండేలా నమిలిగొండ నుంచి పాంనూర్‌కు షార్ట్‌కట్‌గా ఉన్న కేవలం మూడు కిలోమీటర్ల మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా చేయాలని రెండు గ్రామాల ప్రజల గతంలో పలుమార్లు పాలకులకు విన్నవించారు. కాగా ఎట్టకేలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సదరు రోడ్డుకు మోక్షం లభించింది. మూడు కిలోమీటర్ల మట్టిరోడ్డును బీటీ రోడ్డుగా చేసేందుకు గత ప్రభుత్వం కూడా ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ.1.46 కోట్లు కేటాయించింది. దాంతో 2021 జూన్ 26వ తేదీన పాంనూర్–నమిలిగొండ బీటీరోడ్డు పనులకు అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేయడంతో మట్టిరోడ్డు కష్టాలు తీరుతాయని ప్రజలు సంతోషించారు.

కంకరపోసి వదిలేశారు

రోడ్డు పనులను చేపట్టిన కాంట్రాక్టర్ మట్టిరోడ్డును చదును చేసి కంకరపోసి వదిలేశాడు. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డు పనులు మధ్యలోనే వదిలేయడంతో కంకరరోడ్డుగా మారింది. దాంతో అనునిత్యం సదరు రోడ్డు గుండా వెళ్లే రైతులు, వాహనదారులు, ప్రజలు కంకరరోడ్డుపై ప్రయాణంతో నరకయాతన అనుభవిస్తున్నారు. గతంతో మట్టిరోడ్డు అయినా కాస్త నయంగా ఉండేదని, కంకరరోడ్డుతో వాహనాల టైర్లు చెడిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కంకరరోడ్డుపై వెళ్లలేక పలు వురు వాహనదారులు శివునిపల్లి మీదుగా పాంనూర్, నమిలిగొండకు వెళ్తున్నారు. దాంతో అదనంగా మూడు కిలోమీటర్లు తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



నమిలిగొండ–పాంనూర్ రోడ్డు పనుల విషయలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించి పనులు ప్రారంభించగా ఇంతవరకూ పూర్తి చేయలేకపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– ఒగ్గు రాజు, పాంనూర్

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. పనులను మధ్యలోనే ఆపేసిన కాంట్రాక్టర్‌పై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. రాజకీయాలను పక్కన పెట్టి అభివృద్ధికి అందరూ సహకరించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– గాదె రాజు, నమిలిగొండ

మిల్లులకు ధాన్యం తరలించాలి



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

బచ్చన్నపేట: పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని తహసీల్దార్ ఎస్. తిరుపతి ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం కొడవటూర్, ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, కొన్నె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం వివరాలు నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. వాతావరణ మార్పులతో వర్షాలు ఎప్పుడు పడుతాయో తెలియడం లేదుకావున వెంటవెంటనే ధాన్యాన్ని తూకం వేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంఆర్ఐ మెర్గోజు వంశీకృష్ణ, సీసీలు సత్యనారాయణ, నర్సింహులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పాలకుర్తి టౌన్: ఈ నెల 22,23 తేదీల్లో ఈరవెన్ను గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కమిటీ సభ్యుడు ఏదునూరి మదార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఈరవెన్ను గ్రామంలో శిక్షణ తరగతుల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సాయిలు, శోభన్ బాబు,రాజు, అబ్బసాయి ఉన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి

జఫర్‌గఢ్: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు కోరారు. ఉప్పుగల్లులో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని ఆరోపిస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం జీపీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీపీ కార్యదర్శికి అందజేశారు.తిరుపతిగౌడ్, రాజు, నరేష్, గ్రామస్తులు ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సారంగపాణి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: విశ్వనాథపురంలో స్టేషన్‌ఘన్‌పూర్–పాలకుర్తి రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన వానరానికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్–పాలకుర్తి రోడ్డు వెంట విశ్వనాథపురం గ్రామ సమీపంలో తరచుగా వానరాలు సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వానరం మృతిచెందింది. కాగా, ఛాగల్లుకు చెందిన సారంగపాణి వ్యక్తిగత పనులపై అటుగా వెళ్తూ రోడ్డుపై వానరం చనిపోయి ఉండటాన్ని గమనించి తన వాహనాన్ని ఆపి వానరాన్ని రోడ్డుపై నుంచి పక్కకు వేయించాడు. అనంతరం గ్రామస్తులు, యువత సహకారంతో వానరానికి అంత్యక్రియలు నిర్వహించి పూడ్చిపెట్టారు. విద్యాసాగర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, పొన్న రాజేష్, కుమారస్వామి, శ్రీను, ఆము, రాజు పాల్గొన్నారు.

తిరుమలలో ఫతేషాపూర్ ఆధ్యాత్మిక బృందం



ఫతేషాపూర్ అభయాంజనేయస్వామి సేవా బృందం

రఘునాథపల్లి: తిరుమలలో కొనసాగుతున్న అఖండ హరినామ సంకీర్తనలో మండలంలోని ఫతేషాపూర్ శ్రీ అభయాంజనేయస్వామి ఆధ్యాత్మిక భజన కోలాట సేవా బృందం పాల్గొంది. బృందం అధ్యక్షుడు హింగె మైసారావు సారథ్యంలో తిరుమలలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక భజన కోలాటాలతో భక్తులు, ఆలయ అర్చకులచే ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా మైసారావు మాట్లాడుతూ తిరుమల ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు అఖండ హరినామ సంకీర్తనలో తాము పాల్గొని నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకుని హరినామ సంకీర్తనలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బృందం సభ్యులు అరుణ, భీమయ్య, మధురబాయ్, సుదాకర్, ఊర్మిళాదేవి, పేర్వారం రవీందర్, ఇందిర పాల్గొన్నారు.

ఉగ్రవాదులను తుదముట్టించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి

రఘునాథపల్లి: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇకనైనా ఆపి సామాన్య ప్రజల ప్రాణాలను హరించే పాక్ ఉగ్రవాదులను తుదముట్టించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. కంచనపల్లి గ్రామంలోని కురుమ సంఘం భవనంలో శుక్రవారం పార్టీ నాయకులు నాల్కపల్లి దావీద్, ఊడుగుల జయమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ నాల్గవ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆది సాయన్న, సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, కావటి యాదగిరి, సోమయ్య, ఎల్లయ్య, దానియల్, మల్లేష్, నాగేష్, అంజయ్య, రాంచంద్రయ్య, అబ్బయ్య, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

జనగామ రూరల్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గానుగుపహాడ్, అడవికేశ్వాపూర్ గ్రామ పంచాయతీల పరిధిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలన్నారు. తేమ శాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ శాఖ డీఎం హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీసీఓ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడకండ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటూ దోమలను నివారించుకోవడం ద్వారా వివిధ రకాల వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త వహించవచ్చని వైద్యాధికారి హరికృష్ణ, ఆయుర్వేద డాక్టర్ ప్రీతిలు సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ దోమ కుట్టడం వలన డెంగీ సోకుతుందని, చికిత్స కంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ నివారణ ర్యాలీ

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో డెండీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డాక్టర్ హారిక, సుష్మిత, ఫార్మసిస్టు శ్రవంతి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్‌కు మోడల్ స్కూళ్లలోనే చేర్పించండి

రఘునాథపల్లి: విద్యాపరంగా పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ మోడల్ స్కూళ్లలోనే చేర్పించాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధికార ప్రతినిధి కందగట్ల గణేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతీ నియోజకవర్గం కేంద్రానికి ఒకటి చొప్పున ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఈ స్కూళ్లు లేనిచోట మోడల్ స్కూళ్లకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ విద్యాసంస్థ ఖాన్ అకాడమీ, మోడల్ స్కూళ్ల సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సెలవుల నుంచి ప్రత్యేక ఆన్‌లైన్ కోచింగ్‌ను ప్రారంభించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల వలె ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్ డిజిటల్ బోర్డుల ద్వారా మోడల్ స్కూళ్లలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో దేశ భవిష్యత్‌ను మార్చబోతున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: ముత్తారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయలంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సరైన గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ నుంచి గాడిపెల్లి వెంకన్న, గ్యార బాలసోమయ్య, జనగామ ఎల్లయ్య, వెంకన్న, వీరమల్ల యాదగిరి, బీజేపీ నుంచి గ్యార శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, ముత్తారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్, నలమాస రమేష్, గ్యార రాములు తదితరులు ఉన్నారు.

'ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం'



కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను చూపిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో హిమ్మత్‌నగర్, సూరారం, తిమ్మంపేట, తీగారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ రైతులు గ్రామాల్లో కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి లారీల ద్వారా మిల్లులకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, నీరటి కొమురయ్య, కుమార్, ప్రభాకర్, సోమయ్య, నీలం శ్రీను, భాస్కర్, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

వంటపాత్రల అందజేత



బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయానికి నాయకుడు ఇమ్మడి చైతన్య–జితేందర్‌రెడ్డి దంపతులు వంట పాత్రలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో హనుమాన్ మాలధారులు వంట చేసుకునేందుకు ఇబ్బందులు పడుతుండటంతో రూ. 15 వేల విలువైన పాత్రలను అందించామన్నారు. కాపర్తి హరిప్రసాద్, అనిల్, యాసరేణి శ్రీనివాస్, బాపిరాజు, నాగరాజు, శంకరయ్య, రాజమౌళి, అంజిరెడ్డి, నవీన్, అంబదాస్ ఉన్నారు.

దేశ సమగ్రాభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యం



మాట్లాడుతున్న రమేశ్

దేవరుప్పుల: దేశ సమగ్రాభివృద్ధి బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో పార్టీ మండల నూతన కార్యవర్గ సమావేశానికి అధ్యక్షుడు బస్వ భాస్కర్ అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా, మండల అధ్యక్షులను నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. లేగ రాంమోహన్‌రెడ్డి, ఊడుగు రమేష్, ఎల్లయ్య, సృజన్‌కుమార్, బాగాల నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



స్టేషన్‌ఘన్‌పూర్: బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, బడీడు పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాఘవాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేణుకాదేవి అన్నారు. ముందస్తు బడిబాట కార్యాచరణను పురస్కరించుకుని రాఘవాపూర్‌లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయులు మల్లేశం, అజయ్, సీహెచ్.రాధ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను ఆయన సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

జఫర్‌గఢ్: ప్రభుత్వ బడిలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కూనూర్ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల వద్దకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. అనంతరం టీచర్ ఎండీ పర్వేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిరాజుద్దీన్, శ్రీనివాస్, భీమ్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నిడిగొండలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మగళ్ల కృష్ణ (48) తాపీ మేస్త్రీ, పేయింటర్‌గా పనులు చేస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతుండేవి. దీంతో జీవితంపై విరక్తి చెందిన కృష్ణ గురువారం బస్టాండ్ సమీపంలోని వెంచర్ వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. భార్య సుగుణకు ఫోన్ చేసి వెంచర్‌లో తాను పురుగుల మందు తాగానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంచర్ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే కృష్ణ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య సుగుణ, ఇద్దరు కుమారులు చందు, ఆదిత్య ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే కృష్ణ మృతిపట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రఘునాథపల్లి: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని నిడిగొండ బస్‌స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన రాజేందర్‌రెడ్డి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. నిడిగొండలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టి జీవనం కొనసాగిస్తున్న రాజేందర్‌రెడ్డి.. రాత్రి 7 గంటల సమయంలో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై పెట్రోలు బంక్ వైపు వెళ్తుండగా వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఫైర్ స్టేషన్ సమీపాన స్నేహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక అయ్యప్ప డిజిటల్ ఫొటో స్టూడియో యజమాని మొగుదుంపురం కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ప్రభాకర్, శ్రీరాములు పాల్గొన్నారు.